సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 26 । జూలై । 2024



మల్టీడేస్ క్రికెట్‌లో హోరాహోరీ

కడప నగరంలో నిర్వహిస్తున్న మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. పశ్చిమగోదావరి జట్టు 91 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది. -8లో



భూ సమస్యలకు వెంటనే పరిష్కారం

భూ సమస్యలకు రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) ఆర్.పి. సిసోడియా గురువారం ఆదేశించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.380
రెండోరకం	రూ.260	రూ.316

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1328 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	240	456
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1949.360 కిలోలు

న్యూస్‌రీల్

నేడు హార్టిసెట్ పరీక్షలు

రైల్వేకోడూరు అర్బన్: అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలంలోని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీలో 2024 హార్టికల్చర్ కామన్ ఎంట్రెన్స్ (హార్టీ)సెట్ పరీక్షలు శుక్రవారం జరగనున్నాయి. ఈ విషయాన్ని గురువారం యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ కె గోపాల్ తెలిపారు. 67 మంది విద్యార్థులు పరీక్షలకు అర్హులని, వీరంతా ఉదయం 10 నుంచి 12 గంటల మధ్యలో నిర్వహించే పరీక్షలకు హాజరు కావాలన్నారు. హాల్ టికెట్లు అందని వారు కళాశాలలో తమ ఐడీ ప్రూఫ్‌ను చూపించి పొందొచ్చని తెలిపారు.

1 నుంచి ఉర్దూ టెట్ శిక్షణ

కడప ఎడ్యుకేషన్: ముస్లిం మైనారిటీ విద్యార్థులకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఇన్ మైనారిటీస్ ద్వారా ఉచితంగా టెట్ శిక్షణ ఇవ్వనుందని కోర్సు కో–ఆర్డినేటర్ గౌస్ ఆజం తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 1 నుంచి 45 రోజుల పాటు కడప నగరంలోని డాజలింగ్ టాలెంట్ అకాడమీలో ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 8374241829 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

మదనపల్లె సిటీ: జిల్లా సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని వశిష్ట స్కూలులో గురువారం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి సుమారు 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో తుది జట్టుకు 30 మంది ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం నుంచి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్యాంపు నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ జిల్లా అసోసియేషన్ సభ్యులు దిలీప్, మురళీధర్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వశిష్ట స్కూల్ చైర్మన్ పీవీఆర్ గుప్తా, పాఠశాల ప్రిన్సిపాల్ సీనా పి నాయర్, నవీన్, రాజశేఖర్,క్రీడాభారతి కార్యదర్శి నరేష్ బాబు, కమలేష్, మహేంద్ర పాల్గొన్నారు.

నేడు దర్గా స్వామిజీ జయంతి



మహాసమాధి పొందిన సద్గురు దర్గా స్వామిజీ

రామాపురం: మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలోని శ్రీ సాయి నగరంలో వెలసిన శ్రీ దర్బార్ దర్గా స్వామిజీ జయంతి శుక్రవారం నిర్వహించనున్నారు.ఈ విషయాన్ని దర్బార్ సాయి భక్తులు గురువారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి భక్తులు అధికంగా హాజరవుతారని కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం మహాసమాధికి అభిషేకాలు, పూజలు జరుగుతాయన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

నిఫా చికిత్సలకు ప్రత్యేక వార్డు

మదనపల్లె: నిఫా వైరస్ బాధితులకు చికిత్సలు అందించేందుకు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో గురువారం ప్రత్యేక వార్డును ఆర్ఎంఓ ప్రసాద్‌రాజు,డాక్టర్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ మార్పులతో అక్కడక్కడ నిఫా వైరస్ కేసులు దేశంలో నమోదవుతున్న కారణంగా, ముందు జాగ్రత్త చర్యగా ఆస్పత్రిలో 10 బెడ్లలతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎక్కడైనా కేసులు నమోదైతే పూర్తి స్థాయిలో చికిత్సలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఐజీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ సరోజ

మదనపల్లె: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ సరోజ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో జరుగుతున్న భూరిజిస్ట్రేషన్‌లు, లావాదేవీలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 22(ఏ)నిషేధిత భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, వివరాలను పరిశీలించారు. సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐవీఆర్ఎస్.. అంటేనే!

- నామినేటెడ్ పదవులకు బాబు పరీక్ష
- ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా నియామకానికి చర్యలు
- ఈసారి బీజేపీ, జనసేన నేతలతో టీడీపీ నేతలకు తప్పని పోటీ
- కష్టపడిన కార్యకర్తలకు పదవులు దక్కుతాయో లేదోనన్న మీమాంస



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నామినేటెడ్ పదవుల పంపిణీకి కసరత్తు చేస్తున్నారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్) సర్వే ద్వారా వీటిని భర్తీ చేసేందుకు చంద్రబాబు నాయకులకు అగ్ని పరీక్ష పెడుతున్నారు. కష్టపడిన కార్యకర్తలకే ఇస్తామని అంటున్నా..ఎంతవరకు నిజమైన శ్రేణులకు దక్కుతాయా అన్నది అర్థం కావడం లేదు. ఈసారి టీడీపీ ఒక్కటే కాకుండా జనసేన, బీజేపీ కూడా కలవడంతో ఆశావహుల విషయంలో పాము చావకుండా...కర్ర విరగకుండా అనే తరహాలో పంపకాలకు శ్రీకారం చుడుతున్నారు.

పదవులపై ఆశలు

జిల్లాలో తెలుగుదేశం పార్టీతోపాటు బీజేపీ, జనసేనకు సంబంధించి కీలక నాయకులు పదవులపై ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో 60 శాతం టీడీపీ వారికి పదవులు ఇస్తుండగా, జనసేనకు 30 శాతం, బీజేపీకి 10 శాతంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. రైల్వేకోడూరులో మాత్రం జనసేన ప్రాతినిధ్యం ఉండడంతో అక్కడ 60 శాతం జనసేనకు సంబంధించిన వారికి పదవులు ఇవ్వాలని పెద్దలు నిర్ణయించారు. రాష్ట్రస్థాయిలో పదవులకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, టీడీపీ రాయచోటి నేత సుగవాసి ప్రసాద్‌బాబు, ముస్లిం మైనార్టీ వర్గాలకు సంబంధించి కుప్పం పరిశీలకులు ఖాదర్‌బాష తదితరులు ఉన్నారు.రైల్వేకోడూరులో జనసేన అభ్యర్థి శ్రీధర్ గెలుపులో కీలకపాత్ర పోషించిన టీడీపీ నేత రూపానందరెడ్డి కుటుంబంలో ఎవరో ఒకరికి నామినేటెడ్ పోస్టు దక్కుతుందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు టీడీపీ నేత విశ్వనాథనాయుడికు కూడా న్యాయం చేస్తానని గతంలో చంద్రబాబు తన పర్యటనలో హామీ ఇచ్చిన తరుణంలో ఏదైనా పదవి అప్పగించే అవకాశాలు లేకపోలేదు.

నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

జిల్లాలో పార్టీ కోసం కష్టపడిన నేతలకే పదవులు దక్కుతాయని చంద్రబాబు అంటున్నా...కిందిస్థాయిలో ఆచరణ సాధ్యం చేస్తారోనని శ్రేణులు ఒకింత ఆందోళన చెందుతున్నాయి. ఇప్పటికే ఆశావాహులు స్థానిక ఎమ్మెల్యేలు, వారికి పట్టున్న పెద్ద నేతల ద్వారా రాజకీయ సిఫార్సులు చేసుకుంటున్నారు. అయితే నేతల చుట్టూ ప్రదక్షిణలు చేసినా తాము ఒకటి తలిస్తే...దైవం మరొకటి తలుస్తుందోనన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. ఏదిఏమైనా నామినేటెడ్ పోస్టులు అతి త్వరలో భర్తీ చేస్తున్న తరుణంలో జిల్లా అంతటా నేతలు ఆశల పల్లకీలో ఉన్నారు.

ఎన్నో.. మరెన్నో...

కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులకు తెర తీయడంతో రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులతోపాటు ఇతర అనేక పదవులు ఒనగూరనున్నాయి. జిల్లాకు సంబంధించి వివిధ ఆలయాల పాలక మండళ్లతోపాటు మార్కెట్‌యార్డులు, వివిధ విభాగాల్లో డైరెక్టర్ పోస్టులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌తోపాటు ఇతర పోస్టులు రానున్నాయి. రాష్ట్ర స్థాయిలో కొన్నింటిని జిల్లాకు కేటాయించి..పలు నియోజకవర్గాలకు సంబంధించి నేతలకు తర్వాత ఎమ్మెల్సీ పదవులు అప్పగిస్తారని టీడీపీలో చర్చ జరుగుతోంది. క్రీడలు, మైనింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, వివిధ స్థాయి నామినేటెడ్ పోస్టులతో పాటు మహిళా విభాగాల్లో కూడా పలు డైరెక్టర్ పదవులను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి.

రాజంపేట పరిధిలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన సుగవాసి బాలసుబ్రమణ్యంతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రాజు, మదనపల్లె పరిధిలో తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు కూడా రేసులో ఉన్నారు. తంబళ్లపల్లెకు సంబంధించి శంకర్ యాదవ్, జయచంద్రారెడ్డి, కొండ్రెడ్డిలతోపాటు పీలేరు పరిధిలో కూడా ఒకరిద్దరు నాయకులు పదవులపై ఆశలు పెట్టుకున్నారు. అయితే రాజంపేట ఎంపీ స్థానాన్ని అప్పట్లో కూటమి బీజేపీకి కేటాయించిన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల విషయంలో కూడా ఏదైనా బీజేపీ నాయకులకు మంచి అవకాశం కల్పిస్తారన్నది వేచి చూడాల్సిందే!

కారవాన్ టూరిజంపై నాడే నిర్ణయం

- హార్సిలీహిల్స్‌పై ఏర్పాటుకు కసరత్తు
- కొత్త ప్రభుత్వ ఘనతగా కలరింగ్
- దీనిపై 2022లోనే ప్రతిపాదనలు



2022 జూన్ 26న హార్సిలీహిల్స్‌పై పర్యటిస్తున్న టూరిజం ఎండీ కన్నబాబు (ఫైల్)

బి.కొత్తకోట: 'హార్సిలీహిల్స్‌పై పర్యాటకులకు విలాసవంతమైన సౌకర్యాలతో కారవాన్ సౌకర్యం అందుబాటులోకి వస్తోంది. త్వరలోనే దీన్ని అమలు చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేట్టింది' అంటూ పర్యాటక శాఖ హడావుడి చేస్తోంది. వాస్తవానికి... బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై విలాసవంతమైన సౌకర్యాలతో కూడిన కారవాన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2022లోనే టూరిజం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం జరిపారు. 2022 జూన్ 26న అప్పటి, ప్రస్తుత టూరిజం శాఖ ఎండీ కన్నబాబు హార్సిలీహిల్స్‌పై పర్యాటకశాఖ ఉన్నతాధికారులతో పర్యటించారు. ఆదాయ వనరుల పెంపు, అభివృద్ధికి సంబంధించిన చర్యలు, పర్యాటకులను ఎలా ఆకర్షించాలి అనే విషయాలపై సమీక్షించారు. . అనంతరం ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంతో చేపట్టే కారవాన్ సౌకర్యం కోసం దీన్ని కొండపై నిలిపేందుకు భద్రత, మౌలిక సదుపాయాలు, విద్యుత్, వంటి సౌకర్యాలు కల్పించడమే కాకుండా కారవాన్‌కు వర్తక, అగ్నిమాపక ఎన్‌ఓసీల మంజూరుకు ప్రభుత్వం సహకారం ఉంటుందని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. అయితే ఈ చర్యలన్నీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనే తీసుకున్నట్లుగా పర్యాటకశాఖ హడావుడి చేయడం గమనార్హం.

కౌలు కార్డులు ఉంటేనే పథకాలు

రామాపురం: భూమి ఉన్న రైతుల నుంచి భూమి కౌలుకు తీసుకొని సాగు చేసుకునేవారు పత్రం, కౌలు కార్డులు కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి వ్యవసాయ క్షేత్రంలో గురువారం రైతు సేవా కేంద్రంలో పని చేస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి భూమిని కౌలు తీసుకొని సాగు చేసుకునే వారు కార్డు పొంది ఉంటే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఈ కేవైసీ పూర్తి చేయించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగైన వంగతోటను ఆయన పరిశీలించారు. లింగార్షక బుట్టల ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి నాగమణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి చంద్రానాయక్

వినోదం.. విజ్ఞానం

- విద్యార్థుల్లో నైతికత పెంపే లక్ష్యంగా సాగుతున్న 'శిక్షాసప్తాహ్'
- 1 నుంచి 10వ తరగతి వారికి ఆటపాటల ద్వారా అవగాహన

పాఠశాలలు	సంఖ్య
ప్రాథమిక పాఠశాలలు	1,734
ప్రాథమికోన్నత పాఠశాలలు	162
ఉన్నత పాఠశాలలు	304
విద్యార్థులు	1,37,743



టీఎల్ఎంతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం–2020 ప్రవేశపెట్టి నాలుగేళ్లవుతోంది. నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లల్లో విజ్ఞానం, వినోదం పెంచేందుకు ఈనెల 22 నుంచి 28 వరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. నూతన విద్యా విధానం, పర్యావరణ పరిరక్షణ, శారీరక సౌష్టవం, ఆవశ్యకత, ఉపాధి కల్పన నైపుణ్యం ఇలా వివిధ అంశాలపై 1 నుంచి పదోతరగతి విద్యార్థులకు ఆటపాటల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

బోధన కోసం సామగ్రి

మొదటి రోజు అన్ని పాఠశాలల్లో బోధన సామగ్రి ప్రదర్శన చేపట్టారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన, అభ్యసన సామాగ్రిని విద్యార్థులతో తయారు చేయించి ప్రదర్శించారు.

భాషకు పునాది

రెండో రోజు పునాది అభ్యసన చేపట్టారు. ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు ఈ పునాది అభ్యసనం చేపట్టారు. సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం అమలుకు సమాజ భాగస్వాములో చర్చా కార్యక్రమాలు నిర్వహించి అవగానసే కల్పించారు.

క్రీడలకు ప్రాధాన్యం

అన్ని పాఠశాలల్లో క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో వివిధ క్రీడా పోటీలు నిర్వహించి వారి ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేశారు. శారీరక సౌష్టవ ప్రాముఖ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సాంస్కృతిక సంబరం

సాంస్కృతిక దినోత్సవంలో భాగంగా భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని విద్యార్థుల్లో పెంపొందించడానికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నృత్య, నాటికల ప్రదర్శన, గీతాలాపాన,ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా ప్రస్తుత ఉద్యోగవకాశాల నేపథ్యంలో తరగతి గది అనుభాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకున్నారు. డిజిటల్ కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించి, నైపుణ్య విద్య, సమర్థమైన పోటీతత్వాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలి.

పర్యావరణం.. అమ్మకు అంకితం

ఈనెల 27న పర్యావరణ పరిరక్షణ, సంకల్పయాత్ర పేరిట ఏకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి మొక్కలు నాటించడం చేపడతారు. అమ్మకి అంకితం పేరిట కనీసం 35 మొక్కలు నాటించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. పోషణ దినోత్సవంలో పోషకాహార ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేయాల్సి ఉంటుంది.

సామాజిక భాగస్వామ్యం

విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాలతో ఈనెల 29న సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులతో కలిసి కార్యక్రమానికి హాజరైన వారందరూ సహపంక్తి భోజనాలు చేసేలా కార్యక్రమాలు రూపొందించాలి.

విజయవంతానికి కృషి




పాఠశాల్లో నిర్వహించే శిక్షా సప్తాహ్ విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం. అన్ని పాఠశాలల్లో క్యాలండర్ ప్రకారం నిర్వహిస్తున్నాం. డీవైఈఓలు, ఎంఈఓలు పర్యవేక్షించాలని ఆదేశించాం. కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది.

–శివప్రకాష్‌రెడ్డి, డీఈఓ,అన్నమయ్య జిల్లా

వైభవంగా చక్ర, త్రిశూల స్నానం



శ్రీ చెన్నకేశవునికి చక్రస్నానం చేస్తున్న అర్చకులు



సిద్ధేశ్వరునికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

రాజంపేట: తాళ్లపాక గ్రామంలో జరుగుతున్న చెన్నకేశవ స్వామి, సిద్ధేశ్వర స్వామి, వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం గ్రామంలో వ సంతోత్సవాలు నిర్వహించారు. అనంతరం ధ్యాన మందిరం వద్ద చెన్నకేశవస్వామికి చక్రస్నానం, సిద్వేశ్వరుడికి త్రిశూలస్నానం నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు జరిగాయి.

క్లుప్తంగా

భూ దస్త్రాల పరిశీలన



భూ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటపతి

సిద్దవటం : విద్యార్థులు గత కొన్ని సంవత్సరాలుగా మైదానం కోసం ఉపయోగిస్తున్న స్థలాన్ని కడప ఆర్డీఓ వెంకటపతి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సిద్దవటం దిగువపేటలోని సర్వే నెంబర్–143లో 2.85 ఎకరాల భూమిని విద్యార్థులు గత కొద్ది సంవత్సరాలుగా ఆట మైదానంగా ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. ఇటీవల ఒక పట్టాదారు నుంచి కొనుగోలు చేసిన ఆ భూమి నాది.. అంటూ కంచె వేశారన్నారు. విద్యార్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో భూమితోపాటు, తహసీల్దారు కార్యాలయ రికార్డుల్లో ఎలా ఉంది, ఫీల్డ్‌లో ఎలా ఉంది పరిశీలించామని తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మురాషావలి, ఆర్ఐ అనూరాధ, వీఆర్వో కేశవులు, సచివాలయ సర్వేయర్ పురుషోత్తంరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ నారుతో రైతుకు నష్టం



కాయరాని బొప్పాయి పంట

కలకడ : నకిలీ నారుతో బొప్పాయి పంట సాగుచేసిన రైతు పంట దిగుబడి రాక నష్టపోయారు. కలకడ, కలికిరి మండలాల రైతులు అధికంగా బొప్పాయి పంట సాగు చేశారు. ఇందులో భాగంగానే కలకడ మండలం దేవులపల్లెకు చెందిన చరపల్లె వెంకటాద్రినాయుడు తన ఐదెకరాల పొలంలో బొప్పాయి పంట సాగు చేశారు. రూ.10 లక్షల వరకూ ఖర్చుచేసి ఎరువులు, పురుగు మందులు వేసి చీడ పురుగుల నుంచి పంటను కాపాడారు. అయితే పూత దశకు రాగానే 50 శాతం మొక్కలు ఎదగలేదని వెంకటాద్రినాయుడు తెలిపారు. అనంతపురం జిల్లాలో ఓ నర్సరీ నుంచి మొక్క రూ.15 చొప్పున తెచ్చి నాటానని, నర్సరీ యజమానులు కనీసం తనకు రసీదు ఇవ్వలేదన్నారు. కొద్ది రోజుల తర్వాత పూత చూసి ఆనందపడిన రైతులకు కాయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు మోసపోకుండా నకిలీ మొక్కలు ఇచ్చే నర్సరీలపై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం



కడప అర్బన్ : కడప నగరంలోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు. అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలియజేశారు. ఆచూకీ తెలిసిన వారు చిన్న చౌక్ సీఐ పి.నరసింహారెడ్డి సెల్ నెంబరు 9121100520కు తెలియజేయాలని కోరారు.

మల్టీడేస్ క్రికెట్‌లో హోరాహోరీ

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండో రోజు గురువారం వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 28 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. జట్టులోని ప్రణీత్ పవన్ 92 పరుగులు, రేవంత్ నాగకుమార్ 63 పరుగులు చేశాడు. కడప బౌలర్లు నాగకుల్లాయప్ప 5 వికెట్లు, ప్రణవ్‌కుమార్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 215 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పశ్చిమగోదావరి జట్టు 91 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.

ఆధిక్యంలో విశాఖ..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు 69.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 391 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 124, హ్రితిక్ వర్మ 146 పరుగులతో రాణించారు. చిత్తూరు బౌలర్లు బాలాజీ 4, ఉమర్ 2, ధనుష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. జట్టులోని లోహిత్ లక్ష్మినారాయణ 29 పరుగులతో క్రీజులో ఉన్నారు. విశాఖ బౌలర్ రచిత్ 2 వికెట్లు తీశాడు. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆటముగిసే సమయానికి విశాఖ జట్టు స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది.

శ్రీకాకుళం జట్టుకు ఆధిక్యం..

కేఓఆర్ఎం మైదానంలో రెండోరోజు 262 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన శ్రీకాకుళం జట్టు 98.1 ఓవర్లలో 407 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సుశాంత్ 127 పరుగులు, సింధు విఘ్నేష్ 58 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు భార్గవ్ మహేష్ 4, హమీద్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 51 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసింది. జట్టులోని కారుణ్యప్రసాద్ 43, అర్జున్ 43 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు సింధు విఘ్నేష్ 2, జున్నారావు 2 వికెట్లు తీశారు. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 119 పరుగులకే ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. దీంతో శ్రీకాకుళం జట్టు 68 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.



రాజారెడ్డి స్టేడియంలో తలపడుతున్న కడప పశ్చిమగోదావరి జట్లు



146 పరుగులు చేసిన విశాఖ బ్యాట్స్‌మన్ హ్రితిక్ వర్మ



124 పరుగులు చేసిన విశాఖ బ్యాట్స్‌మన్ ఈశ్వర్ రిత్విక్



92 పరుగులు చేసిన పశ్చిమగోదావరి బ్యాట్స్‌మన ప్రణీత్



5 వికెట్లు తీసిన కడప బౌలర్ నాగ కుల్లాయప్ప

46 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

లారీని స్వాధీనం చేసుకున్న రామాపురం పోలీసులు

లక్కిరెడ్డిపల్లి : బద్వేల్ నుంచి కర్ణాటకకు భారీ ఎత్తున తరలిస్తున్న 850 బస్తాల రేషన్ బియ్యాన్ని గురువారం మధ్యాహ్నం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రాయచోటి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారి కళావతి వివరాల మేరకు.. రామాపురం మండలం గువ్వలచెరువు సమీపంలోని గోపగుడిపల్లి చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి, సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. రేషన్ బియ్యం గోనె సంచుల్లోకి మార్చి కర్ణాటకకు తరలిస్తున్న బియ్యం లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రాయచోటి ఎన్ఫోర్స్‌మెంట్ తహశీల్దారు కృపావతి మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి గోదాముకు బియ్యం తరలించినట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా మేనేజర్ శ్రీనివాసమూర్తి, డీఎస్ఓ రఘురాం గోదాము వద్దకు చేరుకుని పట్టుబడిన బియ్యం బస్తాలను పరిశీలించి ఇన్‌చార్జి మల్లికార్జునకు అప్పగించారు. బద్వేల్‌కు చెందిన రైస్ మిల్లర్ యజమానిపై కేసు నమోదు చేశారు.



బియ్యం స్వాధీనం చేసుకున్న రాయచోటి ఎన్‌ఫోర్స్‌మెంట్ తహసీల్దారు కృపావతి

సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్

సిద్దవటం : సిద్దవటం రేంజ్ పరిధిలోని మద్దూరు, సిద్దవటం, కొండూరు, రోళ్లబోడు బీట్‌లలోని సమస్యాత్మక ప్రాంతాల్లో అటవీ సిబ్బంది కూంబింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ కె.ఎం.నయీంవలి, సిద్దవటం రేంజర్ కళావతి మాట్లాడుతూ కడప స్క్వాడ్, సిద్దవటం రేంజ్ సిబ్బందితో కలిసి బుధ, గురువారాల్లో అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎక్కడా స్మగ్లింగ్ ఆనవాళ్లు కనిపించలేదని, మరిన్ని రోజులు కూంబింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేసు, ఎఫ్ఎస్ఓ నాగరాజు, ఎఫ్‌బీఓ పెంచలరెడ్డి, బేస్ క్యాంపు సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.



సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్ నిర్వహించిన అటవీ సిబ్బంది

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ముద్దనూరు : ముద్దనూరు–కడప ప్రధాన రహదారిలోని తిమ్మాపురం సమీపంలో గురువారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు స్కూటరిస్టులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. పులివెందుల ప్రాంతానికి చెందిన శ్యాంసుందర్‌రెడ్డి, తిరుపతికి చెందిన అశోక్‌ల బైక్‌లు తిమ్మాపురం వద్ద పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో శ్యాంసుందర్‌రెడ్డి, అశోక్‌లకు గాయాలయ్యాయి. 108 వాహనంలో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని..

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామం వద్ద గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పల్లవోలు ప్రసాద్, చెట్టూరు ఓబన్న గాయపడ్డారు. ఇద్దరూ ప్రొద్దుటూరు నుంచి పల్లవోలుకు బైక్‌లో వస్తుండగా గ్రామ సమీపంలోని ఖాదర్‌పల్లె క్రాస్ రోడ్డు వద్ద లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్, ఓబన్న గాయపడ్డారు.

సత్యా గ్రీన్ సిటీ సమీపంలో

వల్లూరు : కడప– తాడిపత్రి రహదారిపై వల్లూరు మండల పరిధిలోని సత్యా గ్రీన్ సిటీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని ఎ.ఓబాయపల్లెకు చెందిన ఓబులేసు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో కడపకు బయలుదేరారు. వల్లూరు నుంచి కడప వైపునకు మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న రాజా శాటిలైట్ సిటీ సమీపంలో వెనుక వైపు నుండి ఢీకొట్టాడు. దీంతో రెండు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడ్డాయి. రాజాకు తీవ్ర గాయాలుకాగా, ఓబులేసు స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన క్షతగాత్రుడు



గాయపడ్డ రాజా

యువకుడికి..

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణ పరిధిలోని ఎస్వీ కల్యాణ మండపం సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని అచ్చెయ్య అనే యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు పట్టణంలోని దొరసానిపల్లె గ్రామానికి చెందిన యువకుడు యర్రగుంట్ల వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ట్రాక్టర్‌ను తప్పిస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన అచ్చెయ్యను ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. సీఐ ఈశ్వరయ్య వివరణ కోరగా గాయపడిన వ్యక్తి ఇంకా ఫిర్యాదు చేయలేదన్నారు.

బొలెరో వాహనం ఢీకొని..

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. తెట్టు పంచాయతీ మండెంవారిపల్లెకు చెందిన శంకర్ కుమారుడు నరసింహులు(32) వ్యక్తిగత పనులపై అంగళ్లుకు వస్తున్నారు. మార్గ మధ్యంలో గోల్డన్ వ్యాలీ కళాశాల వద్ద బొలెరో వాహనం ఢీకొంది. నరసింహులుకు తీవ్ర గాయలవడంతో స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

భూ సమస్యలకు వెంటనే పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా

మదనపల్లె : భూ సమస్యలకు రెవెన్యూ అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) ఆర్.పి.సిసోడియా ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని హెచ్ఎస్ఎస్ కార్యాలయంలో గురువారం మదనపల్లె సబ్ డివిజన్‌కు సంబంధించిన భూ సమస్యలపై కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌లతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులు స్వీకరించి పరిష్కరిస్తామని చెప్పడంతో ప్రజలు సబ్ కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వర్షం కురవడం, రెవెన్యూ అధికారుల అర్జీల స్వీకరణకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడాల్సి వచ్చింది. టోకెన్లు కలిగిన వారినే లోనికి అనుమతిస్తామని చెప్పడంతో తోపులాట జరిగింది. అనంతరం సిసోడియా మాట్లాడుతూ... మదనపల్లె డివిజన్‌లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, అధికారులు వాటిపై దృష్టి పెట్టాలన్నారు. సంబంధిత అధికారులకు వినతులు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి

రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్పీ సిసోడియా అధికారులకు సూచించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో హెచ్ఎస్ఎస్ కార్యాలయంలో మూడు జిల్లాల ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు తమ పరిధిలోని ప్రతి సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైందని, ప్రతి ఉద్యోగి రికార్డుల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రాబోయే రోజులలో ఏ రకమైన అవకతవకలకు పాల్పడకుండా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రికార్డులు మెయింటైన్ చేయాలన్నారు. 20 సంవత్సరాలు పూర్తయిన డీకేటీ పట్టాలకు మాత్రమే రిజిస్ట్రేషన్‌కు అనుమతినివ్వాలని, ఇందుకు భిన్నంగా ఏమైనా ఉన్నట్లయితే సర్వే చేయించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్ చేస్తామని, అధికారులు ప్రతి చిన్న విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి సమస్య పరిష్కరించాల్సి ఉంటుందన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్.పి.సిసోడియా



హెచ్ఎస్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరైన అధికారులు

బైక్ చోరీపై కేసు నమోదు

మదనపల్లె : బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని బయోకెమిస్ట్రీ విభాగంలో వైద్యుడిగా పనిచేస్తున్న శ్రీనివాసులు బుధవారం తన ద్విచక్ర వాహనాన్ని ఆస్పత్రి ఆవరణలో ఉంచి వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా బైక్ కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదుచేశారు.

సెప్టెంబరు 1 నుంచి జాతీయ సమితి సమ్మేళనం

రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లె రవీంద్రనాథ్

రాయచోటి అర్బన్ : సెప్టెంబరు 1, 2, 3వ తేదీలలో విశాఖ పట్టణంలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లె రవీంద్ర పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం 42 రోజులపాటు 1.05 లక్షల మంది అంగన్‌వాడీలు, 17 రోజుల పాటు 45వేల మంది మున్సిపల్ కార్మికులు పోరాటం చేశారన్నారు. సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పాలకులు అనుసరిస్తున్న విధానాల కారణంగా కార్మిక శాఖ డమ్మీగా మారిందన్నారు. 2024–25 బడ్జెట్ వేతన జీవులను నిరాశ పరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధిగాళ్ల శ్రీనివాసులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు దేవేంద్ర, వెంకటేష్, వెంకటరమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లె రవీంద్రనాథ్

దొరికిన నగదు బాధితుడికి అప్పగింత

నందలూరు : ఓ వ్యక్తి పోగొట్టుకున్న పర్సును.. పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ వివరాల మేరకు.. కడపకు చెందిన మల్లు దివాకర్ తిరుపతి నుంచి కడపకు వెళ్తున్నారు. నందలూరు వద్ద టీ తాగేందుకు దిగుతుండగా కారులో రూ.90 వేల నగదులున్న పర్సు కింద పడింది. ఇది గమనించని దివాకర్ కడపకు వెళ్లిపోయాడు. అక్కడ దిగి చూసుకోగా డబ్బు ఉన్న పర్సు కనబడకపోవడంతో నందలూరుకు వచ్చి పోలీసులను ఆశ్రయించారు. వారు సీసీ కెమేరాలు పరిశీలించగా ఓ వ్యక్తికి పర్సు దొరికినట్లు గుర్తించి ఆ వ్యక్తి నుంచి నగదు స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పరమేశ్వర్, పోలీసులు దిలీప్ కుమార్, మహేంద్ర పాల్గొన్నారు.



నగదును బాధితులకు అందజేస్తున్న ఎస్ఐ

పాలస్తీనాపై యుద్ధాన్ని ఆపండి

రాయచోటి అర్బన్ : పాలస్తీనాపై ఇజ్రాయెల్ జరుపుతున్న అమానుష యుద్ధాన్ని వెంటనే ఆపాలని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యంఎ.చిష్తి డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం పాలస్తీనా సంఘీభావ సదస్సు నిర్వహించారు. చిష్తి మాట్లాడుతూ చిన్న కారణాలతో పాలస్తీనాలో పిల్లలు, వృద్ధులనే విచక్షణ లేకుండా దాడులు చేయడం తగదన్నారు. అంతర్జాతీయ యుద్ధ నియమాలను ఉల్లంఘించి అమెరికా సహకారంతో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని మానవతావాదులంతా ఖండించాలని కోరారు. అమెరికా తన వాణిజ్య అవసరాలకు యుద్ధాలను ప్రోత్సహిస్తూ ఆయుధాలు అమ్మి సొమ్ము చేసుకుంటోందని ఆరోపించారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, కార్యదర్శి భాగ్యలక్ష్మి, వెంకటయ్య, మాధవయ్య, ఖాదర్‌బాషా, సాహుల్ హమీద్, మస్తాన్‌వలి, యూసఫ్ అష్రఫ్, మహమ్మద్ అలి, అమీర్‌జాన్, ఫిర్‌దౌస్, పుర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యంఎ.చిష్తి

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రాజంపేట రూరల్ : పీహెచ్‌సీ పరిధిలో అంటు వ్యాధులు ప్రబలకుండా సమష్టిగా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారి కొండయ్య ఆదేశించారు. మండలంలోని ఆకేపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాస్, డయేరియా, సికిల్సెల్, అనీమియా, ఇమ్యునైజేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అందరూ తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ మీ పరిదిలోని ప్రజలకు అవగాహన కల్పించి వ్యాధులు ప్రబలకుండా కృషిచేయాలని పిలుపునిచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు ఎ.బ్రహ్మేంద్ర, సీహెచ్ఓ జీవీ.రాజమ్మ, సిద్ధిరామయ్య, రవికుమార్, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కె. కొండయ్య

ప్రాణ హాని వుంది.. మాకు రక్షణ కల్పించండి

ప్రొద్దుటూరు క్రైం: 'మాకు ప్రాణహాని ఉంది.. దయచేసి రక్షణ కల్పించండి' అంటూ రాజా ఫౌండేషన్ మాజీ చైర్మన్ రాధా, విద్యార్థులు, మహిళలతో కలిసి గురువారం ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐ శివప్రసాద్‌కు ఫిర్యాదుచేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ నేత గొర్రె శ్రీనివాసులు రాజా ఫౌండేషన్‌కు కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారని, కార్యదర్శి హోదాలో గురువారం మధ్యాహ్నం చౌడూరు సమీపంలోని పూజా స్కూల్‌కు వెళ్లారన్నారు. రాజా ఫౌండేషన్ కమిటీ మార్చిన తర్వాత పిల్లలను పట్టించుకునే వారే లేరని రాధా, కొందరు సిబ్బంది ఆయనను ప్రశ్నించారు. దీంతో గొర్రెశ్రీనివాసులు, మరింతమంది గట్టిగా అరుస్తూ కొట్టడానికి ప్రయత్నించారని ఆరోపించారు. తమ వెంట ఉన్న మహిళలను పరుష పద జాలంతో దూషిస్తూ ఈ ప్రభుత్వం మాది.. ఎవ్వరికి చెప్పుకుంటావో చెప్పు అంటూ బెదిరించినట్లు రాధా తెలిపారు. రాజారెడ్డి ట్రస్టు కమిటీ ఏర్పాటైన మరుసటి రోజే హత్య చేశారని తెలిపారు. ఆయనను హత్య చేసినట్లు మిమ్మల్ని హత్య చేస్తానంటూ అప్పట్లో కొందరు భయపెట్టి డాక్యుమెంట్లపై సంతకాలు పెట్టించుకున్నారన్నారు. ఆ రోజు నుంచి విద్యార్థులను సరిగ్గా చూసుకోవడం లేదని ఆరోపించారు.



రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద రాజా ఫౌండేషన్ మాజీ చైర్మన్ రాధా, విద్యార్థులు

16 మద్యం సీసాల స్వాధీనం

పులివెందుల రూరల్ : నియోజకవర్గంలోని వేంపల్లె మండలం వెలమవారిపల్లెలో బాబయ్య వద్ద 16 మద్యం సీసాలు సెబ్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వేంపల్లె నుంచి మద్యం తీసుకుని వెలమవారిపల్లె గ్రామంలో విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో గురువారం దాడులు జరిపారు. 16 సీసాలు మాత్రమే స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సెబ్ అధికారులు తెలిపారు.

సెంట్రల్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మృతి

కడప అర్బన్ : కడప నగరం శంకరాపురంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సెంట్రల్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ గిద్దలూరు వెంకటరమణ(44) మృతి చెందినట్లు చిన్న చౌక్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... కడప నెహ్రూనగర్‌కు చెందిన గిద్దలూరు వెంకటరమణ కడప సెంట్రల్ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. మృతుడు అంధుడు అని తెలిపారు. సొంతపని నిమిత్తం తన కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా శంకరాపురం వద్ద మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

కూలిన భారీ వృక్షం

ముద్దనూరు : ఈదురు గాలులకు మండలంలోని కొసినేపల్లె గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఎదుట గురువారం తెల్లవారుజామున ఓ భారీ వృక్షం కూలింది. రాత్రివేళ కూలడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. చెట్టు కూలిన సంఘటనలో ఓ ఇంటి పైకప్పు ధ్వంసమైంది. పగలు కాకపోవడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభం కూడా కూలినట్లు స్థానికులు తెలిపారు.

బాలుడి మృతిపై రిమ్స్ వైద్యుల విచారణ

కమలాపురం : టీకా వేయగానే బాలుడు మృతి చెందడంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. నివేదిక ఇవ్వాలంటూ జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించింది. ఆమేరకు రిమ్స్ వైద్యుల బృందం గురువారం బాలుడి తల్లిదండ్రులను విచారించింది. మండలంలోని వసంతపురం గ్రామానికి చెందిన రెండు నెలల బాలుడు ఈ నెల 6వతేదీన మృతి చెందాడు. ఆ రోజున గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. టీకా వేసిన గంట వరకు బాలుడు ఏడ్చాడు. అనంతరం తల్లి నిద్రపుచ్చింది. కాసేపటికి వెళ్లి లేపాలని చూడగా బాలుడి నుంచి ఉలుకు, పలుకు లేకుండా పోయింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన పెద్దచెప్పలి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి మెడికల్ ఆఫీసర్ జ్ఞాన ప్రసూన బాలుడిని పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

కేంద్ర ప్రభుత్వానికి నివేదిక

బాలుడి మృతి సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డా.ఉమా మహేష్‌కుమార్ నేతృత్వంలో రిమ్స్‌కు చెందిన ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు డా.ఎన్ వీహెచ్.రాజేష్, క్రిష్ణ (పాథాలజీ), డా.ఎస్ నాగసుధారాణి (మైక్రో బయాలజీ), డా.ఎస్.సుధాకర్ (ఫోరెన్సిక్ మెడిసిన్), డా.వి.లక్ష్మీదేవి(ఎస్‌పీఎం), డా.ఎస్ఎండీ సాజిద్ బాషాల బృందం మృతుడి నివాసానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాలుడికి టీకా వేయక ముందు, వేసిన తర్వాత జరిగిన పరిణామాలను తల్లిదండ్రులు అనిత, రాజు, ఇతర కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాలుడు పుట్టిన సమయం, తర్వాత పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఐఓ డా.ఉమామహేష్ కుమార్ మాట్లాడుతూ బాలుడి మృతి పై విచారణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ద్వారా ఆదేశాలు అందాయన్నారు. ఈమేరకు విచారించి నివేదిక కేంద్ర ప్రభుత్వానికి పంపుతాన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దచెప్పలి మెడికల్ ఆఫీసర్ ప్రసూన, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి, ఎపిడిమయోలజిస్ట్ ఖాజా మొహిద్దీన్, సీహెచ్ఓ మునిరెడ్డి పాల్గొన్నారు.



మృతిచెందిన బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విచారణ బృందం